# ఈగపిల్లలు

'ఇదుగో, ఇలా చూడూ-?'

'...............'

'నిన్నే, ఓయ్! ఇక్కడా-'

'...............'

'నీ కిక్కడా వాళ్ళు తెలీటంలేదు-ఇదుగో, పొద్దున్న మనిద్దరం ఆడుకున్నాం, జ్ఞప్తిలేదూ?'

'...............'

'నిన్నే! వినపడదేం? పొద్దున్న-మనం-ఆడుకున్నాం-అప్పుడే మరిచిపోయావా?-ఆ! అవును, హోటలు కుర్రవాడు 'ప్లీటు' జల్లేటప్పుడు ఎంత రివ్వున ఎగిరిపోయి తప్పించుకున్నాం అప్పుడూ...ఇప్పుడేనా జ్ఞాపక మొచ్చిందా?'

'అవును! జ్ఞాపక మొచ్చింది-అయితే, ఇప్పు డేమంటావు?'

'ఏమంటానూ-స్నేహం జ్ఞాపకం చేస్తున్నానంతే? అవునుగానీ, నువ్వు ఆ లోపలికెలా వెళ్ళగలిగావూ?'

'మరిచిపోయాను-జ్ఞాపకం చాలదు!'

'అబద్ధం! ఇప్పటిదాకా ఎంతో స్నేహంగా వుండి ఆడుకున్నాం. ఇప్పుడిప్పుడే కదా నువ్వు అందులో ప్రవేశిస్తి-ఇంతలోనే మరుపా. లోపలికి ఎలా వెళ్ళిందీనూ? కడుపునిండితే ఇలాంటి అబద్ధాలూ, పరాకులూ వొస్తాయి కామోసు!'

'ఎందుకా నోరు చేసుకోవడం? తెలిస్తే చెప్పనూ? ఎలాగో వచ్చాను-వచ్చిన దారి మరిచాను-'

'కొంచం జ్ఞాపకం చేసుకుచూడూ-నీకెంతో పుణ్యముంటుంది-'

'...............'

'ఊహూ! జ్ఞాపకం రావడంలేదు'—

'కడుపునిండితే జ్ఞాపకంరాదులే!'

'ఎందుకీ నిష్ఠూరం, ఏదో ఉపాయ మాలోచించుకుని లోపలికి రాక ?'

'నువ్వు ఏదో ఉపాయ మాలోచించే లోపలకు వెళ్ళగలిగావా?'

'అట్టే మాట్లాడకు-అడుగో హోటలువా డొస్తున్నాడు పారిపోయి-దాక్కో-ప్లిట్ డబ్బా-'

'నువ్వెక్కడ దాక్కుంటావు? నువ్వుమాత్రం అతడికళ్ళ బడవూ?'

'ఈ హాల్వా చాటున దాక్కుంటా-'

'ఎంత అదృష్టం! నీ-'

'...............'

'అప్పుడే వచ్చావా మళ్ళీ?'

'రాక ఎక్కడికిపోనూ? ఆ రొట్టెలను, హాల్వాను విడిచి వెళ్ళమంటే నువ్వుమాత్రం వెడతావా?'

'ఎంతగా కళ్ళల్లో నిప్పులోసుకుంటున్నావు!'

'అన్ని రొట్టెలూ, అంత హాల్వా నువ్వు ఒక్కతెవే తినగలవా? కాస్త నన్నుకూడా లోపలికి రానిస్తే నేం?'

'ఎలా వొస్తావు?'

'నువ్వు వెళ్ళిన దారి నే-'

'అయితే హోటలువా డొచ్చేదాకా వుండు-అతడు మూత తీస్తూంటే లోపలికి దూరుదువు గాని-'

'నువ్వు అలాగే లోపల ప్రవేశించావా?'

'అవును!'

'ఇదో సాకు! ఇంతలో హోటలువాడు రాడని నీకు తెలుసును-ఈలోపున ప్రాణం విసిగి ఏ పెంట కుప్పమీదకో పోతాననుకున్నావు-'

'నీకోసం చెప్పినా మండిపడటం మానవూ? ఎంత చిలిపిదానవు!'

'ఇప్పుడు హోటలువా డొచ్చి మూత తీస్తా డంటావా?'

'ఏమో, నాకెలా తెలుసూ? ఫలానప్పు డొస్తానని నాతో చెప్పాడా?'

'అయితే హోటలువాడొచ్చి మూత తెరిచేవరకూ నే నిక్కడే ఆకలితో ఎదురు చూస్తూండాలన్న మాట?'

'అవును-ఇంకో మార్గం లేదు-'

'సరే అయితే అలాగే వుంటాను-'

'చాలా సేపవుతుందేమో. అతడు వచ్చి మూత తియ్యడానికి-'

'ఎంతసేపైనా సరే వుంటాను-ఈ ఆకలితో ఎక్కడికి పోతాను?'

'నీకు ఆహారం దొరికేచోటు ఇంకో ఏదీ లేదూ?'

'నీకు లేకనే ఇక్కడకొచ్చావా?'

'నీది చాలా దుష్టనైజం-మాట్లాడితే కస్సు మంటున్నావు-'

'ఆకలి! వెర్రి ఆకలి! కడుపు దహించుకు పోతోంది-'

'పాపం!'

'నువ్వు జాలి వెళ్ళబొయ్యక్కర్లేదు-రొట్టెలతోనూ హల్వాతోనూ నీ ఆకలి శాంతించిందా?'

'అందరి ఆకళ్ళూ తీరేవే-కొంచం వోపిక పడితే!'

'అందరివీ తీరినా తీరకపోయినా ముందు నీ ఆకలి తీరింది! రొట్టెలు బావున్నాయా? హల్వా? అంతసేపట్నుంచి ఆ మధుర భక్ష్యాల మధ్య! ఏమదృష్టం!'

'నీకూ పడుతూందిలే-ఆ అదృష్టం-అడుగో హోటలువాడు తాళాలుచ్చుకుని ఇటే వొస్తున్నాడు-అతడు మూత తియ్యగానే నువ్వు రింగున ఎగిరి లోపల ప్రవేశించాలి-అతడు చూడకుండా సుమా?'

'ఇట్టే ఎగిరివస్తా. రొట్టెలు బావున్నాయి కదూ? హల్వా బిస్కత్తులూ?...'

* * *

'ఎంత కఠినుడు! ఇద్దర్నీ కూడా ఇవతలకు తరిమేశాడు-'

'రా పెంటకుప్పే ఇంక మనకు...'